గాంధీ దవాఖానపై నిజనిర్ధారణ కమిటీ

- నిపుణుల కమిటీ ఆధ్వర్యంలో అధ్యయనం చేస్తాం
- బాధ్యత గల ప్రతిపక్షంగా సూచనలిస్తాం
- మాతా శిశు మరణాలపై సర్కారు స్పందన అమానవీయం
- బీఆర్‌ఎస్ ప్రైవేట్‌కు కొమ్ముకాస్తే తెల్లకోటు విప్లవం సాధ్యమయ్యేదా?: కేటీఆర్

హైదరాబాద్, సెప్టెంబర్ 19 (నమస్తే తెలంగాణ): గాంధీ దవాఖానలో కొనసాగుతున్న మాతా శిశు మరణాలపై బీఆర్‌ఎస్ తరఫున నిజ నిర్ధారణ కమిటీని ఏర్పాటుచేస్తామని ఆ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కే తారకరామారావు తెలిపారు. నిపుణుల కమిటీ ఆధ్వర్యంలో గాంధీ దవాఖానలో జరుగుతున్న మరణాలపై అధ్యయనం చేసి, గుర్తించిన అంశాలను ప్రభుత్వంతోపాటు ప్రజలతోనూ పంచుకుంటామని చెప్పారు. పార్టీ తరఫున చేసే ఈ ప్రయత్నంలో ప్రభుత్వం కలిసి రావాలని, ప్రజల ఆరోగ్యాలను బాగు పరిచేందుకు బాధ్యత కలిగిన ప్రతిపక్షంగా తాము ఇచ్చే సలహాలు, సూచనలను స్వీకరించాలని విజ్ఞప్తి చేశారు. గాంధీ దవాఖానలో జరుగుతున్న మరణాలపై దృష్టి సారించాల్సింది పోయి ఆ విషయాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకొచ్చిన బీఆర్‌ఎస్‌పై ఎదురుదాడికి దిగడం బాధాకరమని పేర్కొన్నారు. ప్రభుత్వం సమస్యను పరిష్కరించాల్సింది పోయి పక్కదారి పట్టించే కార్యక్రమానికి తెరలేపిందని ఆయన విమర్శించారు. ఇప్పటికైనా మరణాలపై సమీక్షించారా? నాణ్యమైన వైద్యం అందించేందుకు ఫోకస్ చేశారా? ఇటీవల చేపట్టిన బదిలీల్లో సీనియర్ డాక్టర్లను ట్రాన్స్‌ఫర్ చేశారనే ఆరోపణల్లో వాస్తవం ఉన్నదా? లేదా? అనే ప్రశ్నలకు బదులు ఇవ్వాలని కేటీఆర్ డిమాండ్ చేశారు.

తెల్లకోటు విప్లవం సాధ్యమయ్యేదా?

రాష్ట్ర ప్రభుత్వం గాంధీ దవాఖానలో ఉన్న అనుభవజ్ఞులైన డాక్టర్లను బదిలీ చేయడం వలన అక్కడ చికిత్సలకు తీవ్రమైన ఆటంకం ఏర్పడుతున్నదనే విషయాన్ని గుర్తించి, మరణాలను తగ్గించే ప్రయత్నం చేయాలని కేటీఆర్ సూచించారు. వైద్యం అందడం లేదని, పసిపిల్లలు పిట్టల్లా రాలిపోతున్నారని అంటే బురదజల్లుతున్నామని మాట్లాడతారా? అని మండిపడ్డారు. ప్రభుత్వం ఆరోపించినట్టు బీఆర్‌ఎస్ పార్టీ ప్రైవేటుకు కొమ్ముకాయాలనుకుంటే హైదరాబాద్ నగరం చుట్టూ పెద్ద దవాఖానల నిర్మాణాలు, వరంగల్‌లో అతి పెద్ద దవాఖాన నిర్మాణం, బస్తీ దవాఖానాలు, గ్రామాల్లో క్లినిక్‌లు చేపట్టే వాళ్లమా? అని ప్రశ్నించారు. కేసీఆర్ కిట్లు, తల్లీబిడ్డను ఇంటి దగ్గర దిగబెట్టే వాహనాలు, సాధారణ ప్రసవాలు జరిగేలా చర్యలు తీసుకోవడం, రెండు ప్రభుత్వ మెడికల్ కాలేజీలు ఉన్న రాష్ట్రంలో 33 మెడికల్ కాలేజీల ఏర్పాట్లు సాధ్యమయ్యేవా? అని నిలదీశారు. కేసీఆర్ హయాంలో ప్రైవేట్‌కు కొమ్ముకాస్తే తెలంగాణ వైద్యుల ఉత్పత్తి కర్మాగారంగా, తెల్లకోటు విప్లవాన్ని సృష్టించేదా? అని ప్రశ్నించారు.

మానవీయంగా స్పందించండి

తమపై ఎదురుదాడి చేయడం మానేసి ముందుగా పాలనలో లోపాలను సరిదిద్దుకోవాలని ప్రభుత్వానికి కేటీఆర్ సూచించారు. పోయిన ప్రాణాలు తిరిగిరావని, ఆ తల్లుల కడుపుకోత తీర్చలేమనే సోయితో ఆలోచించి ప్రజలు కూడా మన బిడ్డలే అని మానవత్వంతో ఆలోచిస్తే కాంగ్రెస్ పాలన తీరు కూడా మారుతుందని హితవు పలికారు. రాష్ట్ర ప్రభుత్వానికి ప్రభుత్వ దవాఖానలో జరుగుతున్న మరణాలు ఒక సంఖ్యగా మాత్రమే కనిపించడం దారుణమని, అది ఒక కుటుంబానికి సంబంధించిన శిశువు లేదా తల్లి మరణం అనే మానవీయ కోణంలో ఆలోచించాలని సూచించారు.

ఆటో కార్మికులకు సంఘీభావం తెలుపుతున్న బీఆర్‌టీయూ రాష్ట్ర ఆటో యూనియన్ అధ్యక్షుడు వేముల మారయ్య, ఏఐటీయూసీ బి. వెంకటేశ్, సీఐటీయూ శ్రీకాంత్, ఐఎఫ్‌టీయూ ప్రవీణ్, యూటీఏడబ్ల్యూ సలీం, ఆటో ఓనర్స్ అసోసియేషన్ రఫత్‌లు

ఇక సహించేది లేదు!

- అక్టోబర్ 22న చలో హైదరాబాద్‌కు ఆటో కార్మికుల పిలుపు
- ఆటో జేఏసీ సమావేశంలో నాయకుల ఆగ్రహం

హైదరాబాద్ సిటీబ్యూరో/చిక్కడపల్లి, సెప్టెంబర్ 19 (నమస్తే తెలంగాణ) : కాంగ్రెస్ ప్రభుత్వానికి రోజులు దగ్గరపడ్డాయని బీఆర్‌టీయూ రాష్ట్ర అధ్యక్షుడు వేముల మారయ్య హెచ్చరించారు. కాంగ్రెస్ మోసపూరిత హామీలతో ఆటో డ్రైవర్లు ఉపాధి కోల్పోవాల్సి వచ్చిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. బాగ్‌లింగంపల్లి బీఆర్‌టీయూ కార్యాలయంలో 'కాంగ్రెస్ మోసపూరిత హామీలు–ఆటోడ్రైవర్ల ఆత్మహత్యలు' అంశంపై ఆటో జేఏసీ నాయకుల సమావేశం గురువారం జరిగింది. ఈ సందర్భంగా మారయ్య మాట్లాడుతూ.. ఇంకెంతమంది ఆటో డ్రైవర్లు ఆత్మహత్యలు చేసుకుంటే ప్రభుత్వం స్పందిస్తుందో సీఎం చెప్పాలని ప్రశ్నించారు. ఇక సహించే ప్రసక్తే లేదని హెచ్చరించారు. అక్టోబర్ 22న చలో హైదరాబాద్‌కు పిలుపునిచ్చినట్టు తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా ఆటో డ్రైవర్లతో ఇందిరాపార్క్ వద్ద మహాధర్నా చేపట్టనున్నట్టు చెప్పారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక 50 మందికి పైగా ఆటో డ్రైవర్లు ఆత్మహత్య చేసుకున్నట్టు గుర్తుచేశారు. ఏఐటీయూసీ నాయకుడు వెంకటేశ్ మాట్లాడుతూ.. రాష్ట్రంలో ఎన్నడూ లేని విధంగా ఆటో డ్రైవర్లు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కాంగ్రెస్ పార్టీయే ఇందుకు కారణమని మండిపడ్డారు. సీఐటీయూ నాయకుడు పుప్పాల శ్రీకాంత్ మాట్లాడుతూ.. ఉపాధి లేక, కుటుంబాన్ని పోషించలేక ఆటోడ్రైవర్లు ఇబ్బందులు పడుతున్నారని మంత్రి దృష్టికి తీసుకెళ్లినా ఫలితం లేదని వాపోయారు. ఐఎఫ్‌టీయూ నాయకుడు ప్రవీణ్ మాట్లాడుతూ.. అక్టోబర్ 22న జరిగే చలో హైదరాబాద్‌ను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో యూటీఏడీడబ్ల్యూ సలీం, ఆటో ఓనర్స్ అసోసియేషన్ నాయకుడు రఫత్, రమేశ్, రామకృష్ణ, చంద్రమౌళి, ఏటీసీ నాయకులు అశోక్ జంగయ్య, అఫ్జల్ తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ గూండాలకు పోలీసుల వత్తాసు

- రాష్ట్రం ప్రశాంతంగా ఉండాలని ఓపిక పడుతున్నాం
- సీఎం వల్లే రాష్ట్రంలో అశాంతి
- బీఆర్‌ఎస్ నేతలపై దాడులు ఆపాలి
- దాడుల్లో పోలీసుల పాత్ర ఉన్నది
- మీడియాతో బీఆర్‌ఎస్ నేతలు జగదీశ్‌రెడ్డి, ప్రశాంత్‌రెడ్డి
- వరస ఘటనలపై డీజీపీకి ఫిర్యాదు

హైదరాబాద్, సెప్టెంబర్ 19 (నమస్తే తెలంగాణ): రాష్ట్రంలో బీఆర్‌ఎస్ కార్యకర్తలు, నేతలపై కాంగ్రెస్ గూండాలు దాడులకు తెగబడుతుంటే పోలీసులు వత్తాసు పలుకుతున్నారని మాజీమంత్రి జగదీశ్‌రెడ్డి ఆగ్రహం వ్యక్తంచేశారు. తాము కూడా ఎదురు తిరిగి తన్నడం మొదలుపెడితే లెక్క మరోలా ఉంటుందని హెచ్చరించారు. రాష్ట్రం ప్రశాంతంగా ఉండాలని ఓపిక పడుతున్నామని స్పష్టంచేశారు. రాష్ట్రంలోని ఇటీవలి పరిణామాలు, కాంగ్రెస్ గూండాలపై చర్యలకు పట్టుబడుతూ గురువారం డీజీపీ జితేందర్‌కు బీఆర్‌ఎస్ ఎమ్మెల్యేలు ప్రశాంత్‌రెడ్డి, వివేకానంద, పాడి కౌశిక్‌రెడ్డి, డాక్టర్ సంజయ్, సీనియర్ నేత ఆర్‌ఎస్ ప్రవీణ్‌కుమార్‌తో కలిసి జగదీశ్‌రెడ్డి వినతి పత్రం అందజేశారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. రాష్ట్రంలో శాంతిభద్రతలు అదుపు తప్పడానికి ప్రధాన కారణం సీఎం, ఆయన వాడుతున్న భాష, ప్రవర్తనేనని తెలిపారు. కౌశిక్‌రెడ్డి ఇంటిపై జరిగిన దాడిలో ఎమ్మెల్యే గాంధీపై సీఎం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఓ వ్యక్తిగా, సీఎంగా గాంధీపై చర్యలు తీసుకునే స్థాయి రేవంత్‌కు ఇంకా రాలేదని ఎద్దేవా చేశారు. సీఎం పదవికి ఉన్న గౌరవం, దానికి ఉన్న విలువ కూడా రేవంత్‌కు తెలియదని విమర్శించారు. తాను మాట్లాడే వేదిక ఏమిటో కూడా సీఎం మర్చిపోయి.. బడిపిల్లల దగ్గర కూడా కేసీఆర్, కేటీఆర్‌పై బూతులు తిడుతూ, పీసీసీ అధ్యక్షుడి కార్యక్రమానికి వెళ్లి 'చింతపండు చేసినం' అంటూ మాట్లాడుతున్నారని మండిపడ్డారు.

డీజీపీ జితేందర్‌కు ఫిర్యాదు చేస్తున్న బీఆర్‌ఎస్ నేతలు జగదీశ్‌రెడ్డి, ప్రశాంత్‌రెడ్డి, ఆర్‌ఎస్ ప్రవీణ్‌కుమార్, వివేకానంద, పాడి కౌశిక్‌రెడ్డి, డాక్టర్ సంజయ్

దాడుల్లో పోలీసుల పాత్ర

బీఆర్‌ఎస్ నేతలు, కార్యకర్తలపై జరుగుతున్న దాడుల్లో పోలీసుల పాత్ర కూడా ఉన్నదని జగదీశ్‌రెడ్డి అన్నారు. ఇప్పటికే 4 సంఘటనలు జరిగాయని తెలిపారు. పోలీసుల ఎదుటే కాంగ్రెస్ గుండాలు దాడులు చేస్తున్నా చోద్యం చూస్తున్నారని వెల్లడించారు. ఇదే విషయంపై గతంలోనూ కేటీఆర్ ఆధ్వర్యంలో డీజీపీకి ఫిర్యాదు చేశామని గుర్తుచేశారు. తిరుమలగిరిలో బీఆర్‌ఎస్ కార్యకర్తలు, రైతుల దీక్షపై కాంగ్రెస్ గూండాలు దాడిచేస్తుంటే, వారికి పోలీసులు సహకరించారని చెప్పారు. ఆ వీడియోలు, ఫొటోలతో సహా డీజీపీకి అప్పగించామని వివరించారు. ఖమ్మంలో నలుగురు మాజీ మంత్రులు, పది మంది ఎమ్మెల్యేలు వరద బాధితులను పరామర్శిస్తూ.. సహాయ కార్యక్రమాలు చేపడితే కాంగ్రెస్ గూండాలు రాళ్లదాడి చేసి, ఓ కార్యకర్తను కారు కిందకు నెట్టేసి చంపే ప్రయత్నం చేశారని ఆగ్రహం వ్యక్తంచేశారు. మాజీమంత్రి హరీశ్‌రావు కారుపై దాడి చేయడం, హత్యాప్రయత్నం చేయటంపైనా ఫిర్యాదు చేశామని తెలిపారు. సిద్దిపేటలో ఎమ్మెల్యే క్యాంప్ ఆఫీసుపై దాడి చేస్తుంటే.. ఏసీపీ అక్కడే ఉన్నా కాంగ్రెస్ గూండాలపై ఎలాంటి చర్యలు లేవని ఆగ్రహం వ్యక్తం చేశారు.

12 ట్రాఫిక్ సిగ్నల్స్ క్లియరెన్స్ ఎలా ఇస్తారు?

బీఆర్‌ఎస్‌కు న్యాయంగా దక్కాల్సిన పీఏసీ చైర్మన్ పదవిని కాంగ్రెస్‌లో చేరిన అరికెపూడి గాంధీకి ఇవ్వటంపై ఎమ్మెల్యే కౌశిక్‌రెడ్డి రాజకీయంగా సవాల్ చేశారని జగదీశ్‌రెడ్డి గుర్తుచేశారు. గాంధీ బీఆర్‌ఎస్ కండువా కప్పుకోవాలని కౌశిక్‌రెడ్డి సవాల్ చేస్తే.. పోలీసులు పొద్దున్నే హౌజ్‌అరెస్టు చేశారని చెప్పారు. పోలీసులకు గౌరవం ఇచ్చిన కౌశిక్‌రెడ్డి అక్కడే ఉండిపోతే.. '10 గంటలకల్లా రాకపోతే నేను నీ ఇంటికి వస్తాను' అని 20 కిలోమీటర్ల దూరం నుంచి బయల్దేరి ఎమ్మెల్యే గాంధీని అడ్డుకోవాల్సిన ఏసీపీ, సీఐ, ఎస్సైలు 12 చోట్ల ట్రాఫిక్ సిగ్నల్స్‌కు క్లియరెన్స్ ఇచ్చారని ఆగ్రహం వ్యక్తంచేశారు. ఇంటిమీదకు తీసుకొచ్చి దగ్గరుండి దాడి చేయించారని, వారిపైనా కేసులు పెట్టాలని డీజీపీని కోరినట్టు వెల్లడించారు. కాంగ్రెస్ నేతల బర్త్‌డేలను ఏకంగా ఎస్సైలు, సీఐలు పోలీసు స్టేషన్లలోనే జరపడం దారుణమని అన్నారు.

లాఠీ దెబ్బలు ఎదుర్కొన్న అనుభవం మాది

పోలీసుల దెబ్బలు తమకు కొత్తేం కాదని, ఉద్యమాలు చేసిన అనుభవం తమది అని జగదీశ్‌రెడ్డి తేల్చిచెప్పారు. 'పోలీసు లాఠీలు ఎదుర్కొన్న అనుభవం మాది. సీఎంగా ఆయన (రేవంత్) నోరు కాపాడుకోవాలె. నోరు మంచిదైతే.. ఊరు మంచిదైతది. నాలుక మంచిగ పెట్టుకోకపోతే.. మీరన్న మాటలు మీకే వర్తిస్తాయి' అని కాంగ్రెస్‌ను జగదీశ్‌రెడ్డి హెచ్చరించారు. కార్యకర్తలు ఏదైనా తప్పులు చేస్తే సరిచేయాల్సిన బాధ్యత నాయకులకు ఉన్నదని, కానీ ఏకంగా సీఎం వారిని రెచ్చగొడుతున్నారని ఆరోపించారు. రాష్ట్ర గౌరవాన్ని కాపాడాల్సిన బాధ్యత పోలీసులపై ఉందని డీజీపీకి చెప్పామని జగదీశ్‌రెడ్డి తెలిపారు. రాష్ట్రంలో గుడులు, మసీదులు, చర్చిలు, పార్టీల ఆఫీసులు ప్రజలకు సంబంధించినవిగానే వాటి నిర్మాణానికి అనుమతులు తీసుకోవడం లేదు. నల్లగొండలో పార్టీ ఆఫీసులపై మాట్లాడుతూ అందరికీ సమన్యాయం జరగాలని కోరుకుంటున్నామని పేర్కొన్నారు.

ఎంపీ రఘునందన్‌రావుపై హైకోర్టు ఆగ్రహం

- కోర్టు ధిక్కరణ నోటీసులు జారీ..

హైదరాబాద్, సెప్టెంబర్ 19 (నమస్తే తెలంగాణ): న్యాయవ్యవస్థపై మీడియా సమావేశంలో బీజేపీ మెదక్ ఎంపీ ఎం రఘునందన్‌రావు అనుచిత వ్యాఖ్యలు చేయడాన్ని హైకోర్టు తీవ్రంగా పరిగణించింది. ఆయనకు కోర్టు ధిక్కరణ నోటీసులు జారీచేసింది. కోర్టు ధిక్కరణ చర్యలు ఎందుకు తీసుకోరాదో? వివరణ ఇవ్వాలని ఆదేశించింది. సమాజంలో న్యాయవ్యవస్థ గౌరవ, ప్రతిష్ఠలను దెబ్బతీసే ప్రయత్నాలు చేసేలా రఘునందన్ వ్యాఖ్యలు ఉన్నాయని హైకోర్టు న్యాయమూర్తి లేఖ రాశారు. ఆ లేఖను హైకోర్టు సుమోటోగా తీసుకొని క్రిమినల్ కోర్టు ధిక్కరణ పిటిషన్‌గా పరిగణనలోకి తీసుకున్నది. దీనిపై ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అలోక్ ఆరాధే, జస్టిస్ జే శ్రీనివాసరావుతో కూడిన ధర్మాసనం గురువారం విచారణ జరిపి రఘునందన్‌కు కోర్టు ధిక్కరణ నోటీసులు జారీ చేసింది.

న్యాయమూర్తి లేఖలోని అంశాలు

ఎన్ కన్వెన్షన్ కూల్చివేత వ్యవహారంలో ఆగస్టులో ఎంపీ రఘునందనరావు మీడియా సమావేశం నిర్వహించి న్యాయవ్యవస్థకు వ్యతిరేకంగా వ్యాఖ్యలు చేశారని న్యాయమూర్తి లేఖలో పేర్కొన్నారు. ఎన్ కన్వెన్షన్ తరఫున హౌస్ మోషన్ పిటిషన్ దాఖలు కాగా కూల్చివేతపై స్టే ఇస్తూ హైకోర్టు మధ్యంతర ఉత్తర్వులు ఇవ్వడంపై ఎంపీ అనుచిత ఆరోపణలు చేశారని న్యాయమూర్తి ప్రస్తావించారు. జడ్జీలు కండ్లకు గంతలు తీసి చుట్టూ జరుగుతున్నవాటిని గమనించి ఉత్తర్వులు జారీ చేయాలన్నారని లేఖలో వివరించారు. న్యాయమూర్తి లేఖను హైకోర్టు క్రిమినల్ కోర్టు ధిక్కరణ పిటిషన్‌గా పరిగణనలోకి తీసుకుని రఘునందన్‌రావుకు నోటీసులు జారీ చేసింది. మీడియా భేటీల్లో ఇష్టం వచ్చినట్టు ఎలా మాట్లాడతారని నిలదీసింది.. దీనిపై వివరణ ఇస్తూ కౌంటర్ దాఖలు చేయాలని నోటీసులు జారీ చేసింది. విచారణ నాలుగు వారాలు వాయిదా వేసింది.

దళిత, గిరిజనుల హక్కులకు రేవంత్‌రెడ్డి భంగం

- ఎస్సీ, ఎస్టీ వర్గీకరణ, క్రీమిలియర్‌కు వ్యతిరేకంగా 30న చలో సచివాలయం : కృష్ణస్వరూప్

ఎదులాపురం, సెప్టెంబర్ 19: దళిత, గిరిజన, బహుజనుల హక్కులను దెబ్బతీయడానికి పూనుకున్న కాంగ్రెస్ ప్రభుత్వాన్ని తెలంగాణలో బొంద పెట్టాలని ఎస్సీ, ఎస్టీ వర్గీకరణ వ్యతిరేక పోరాట సమితి జాతీయ చైర్మన్, దళిత బహుజన పార్టీ (డీబీపీ) జాతీయ అధ్యక్షుడు వడ్లమూరి కృష్ణస్వరూప్ పేర్కొన్నారు. గురువారం ఆదిలాబాద్ పట్టణంలోని ప్రింట్ మీడియా ప్రెస్‌క్లబ్‌లో సచివాలయం ముట్టడి కరపత్రాలను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎస్సీ, ఎస్టీ వర్గీకరణ, క్రీమిలియర్‌కు వ్యతిరేకంగా సెప్టెంబర్ 30న నిర్వహించనున్న చలో సచివాలయం ముట్టడికి తరలిరావాలని పిలుపునిచ్చారు.

కేసీఆర్ హయాంలో భారీగా ఉద్యోగాల సృష్టి

మొదటిపేజీ తరువాయి...

రంగాలకు చెందిన ఎంఎస్‌ఎంఈల్లో దాదాపు 67 లక్షల మందికి ఉద్యోగాలు లభించాయి. ఇందులో గడిచిన పదేండ్లలోనే దాదాపు 30 లక్షల ఉద్యోగాలు లభించినట్టు వివిధ గణాంకాలు స్పష్టంచేస్తున్నాయి. ముఖ్యంగా ఐటీ, సేవల రంగంలో కేసీఆర్ ప్రభుత్వ హయాంలో సుమారు 15 లక్షల ఉద్యోగాలు లభించాయి. ఐటీ, పరిశ్రమల మంత్రిగా కేటీఆర్ చేసిన ప్రత్యేక కృషితో పెద్ద ఎత్తున ఐటీ, బ్యాంకింగ్, బీమా సంస్థలు రాష్ట్రంలో కొలువుదీరాయి. రాష్ట్రంలో వ్యవసాయ ఉత్పత్తులు గణనీయంగా పెరగడంతో ఆహారశుద్ధి రంగంపై దృష్టి కేంద్రీకరించిన కేసీఆర్ సర్కారు, ప్రత్యేక ఫుడ్ ప్రాసెసింగ్ జోన్లను ఏర్పాటుచేసింది. కోకాకోలా వంటి అనేక బహుళజాతి సంస్థలు కూడా రాష్ట్రంలో ఏర్పాటయ్యాయి. వస్త్ర పరిశ్రమ, ఎలక్ట్రానిక్స్, ఆటోమొబైల్స్, ఇంజినీరింగ్, ఫార్మా, లైఫ్‌సైన్సెస్ రంగాలకు ప్రత్యేక పారిశ్రామికవాడలను ఏర్పాటుచేసి భారీగా పెట్టుబడులను ఆకర్షించడంలో కేసీఆర్ ప్రభుత్వం విజయవంతమైంది. దీంతో ఆయా రంగాల్లో పెద్ద ఎత్తున ఉద్యోగావకాశాలు లభించాయి.

రాష్ట్ర ప్రభుత్వ నివేదిక ప్రకారం రాష్ట్రంలో వివిధ రంగాల్లో లభించిన ఉద్యోగాలు

పరిశ్రమ	సూక్ష్మ	చిన్నతరహా	మధ్యతరహా	మొత్తం
సేవలు	29,34,242	2,39,793	93,330	32,67,365
ఆహార తయారీ	9,23,611	62,271	24,211	10,10,093
ఖనిజ, చెక్క ఆధారిత	4,08,110	26,837	9,379	4,44,326
ఇంజినీరింగ్, క్యాపిటల్ గూడ్స్	3,67,952	67,558	37,763	4,73,273
ఎఫ్‌ఎంసీజీ, గృహోపకరణాలు	3,60,892	33,411	14,489	4,08,792
టెక్స్‌టైల్స్	2,76,601	10,860	9,348	2,96,809
ఆటోమొబైల్స్	2,46,534	8,292	9,427	2,64,253
ఆరోగ్యం, లైఫ్‌సైన్సెస్	1,42,209	38,605	34,385	2,15,199
ప్లాస్టిక్, పాలిమర్స్	82,314	21,958	14,077	1,18,349
ఎలక్ట్రానిక్స్, ఐటీ హార్డ్‌వేర్	72,574	7,172	8,122	87,868
రత్నాలు, ఆభరణాలు	59,750	8,984	3,398	72,132
వ్యర్థాల నిర్వహణ, గ్రీన్ టెక్నాలజీస్	23,804	1,631	598	26,033
మొత్తం				66,84,492

ఆర్టీసీ కార్మికుల డిమాండ్స్ పరిష్కరించాల్సిందే

- డిమాండ్స్‌డేలో బస్‌భవన్ ఉద్యోగులు

హైదరాబాద్, సెప్టెంబర్ 19 (నమస్తే తెలంగాణ): ఆర్టీసీ స్టాఫ్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్ (ఎస్‌డబ్ల్యూఎఫ్) ఆధ్వర్యంలో టీజీఎస్‌ఆర్టీసీ బస్‌భవన్ ఉద్యోగులు గురువారం డిమాండ్స్ డే పాటించారు. ఈ సందర్భంగా ఎస్‌డబ్ల్యూఎఫ్ ప్రధాన కార్యదర్శి వీఎస్ రావు, రాష్ట్ర కార్యదర్శి భిక్షపతిగౌడ్, ఎంఎన్‌రావు మాట్లాడుతూ ప్రభుత్వం నుంచి రావాల్సిన రూ. 430కోట్ల రీయింబర్స్‌మెంట్ విడుదల చేయాలని డిమాండ్ చేశారు. రద్దీకి అనుగుణంగా కొత్త బస్సులను కొనుగోలు చేయాలని, రెగ్యులర్ ప్రాతిపదికన నియామకాలు చేపట్టాలని, డ్రైవర్లు, కండక్టర్లపై నమోదైన కేసులను సానుభూతితో ఎత్తివేయాలని కోరారు. సీసీఎస్‌లో డెలిగేట్స్ ఎన్నికలు నిర్వహించేందుకు అనుమతివ్వాలని డిమాండ్ చేశారు. ఈ నెల 21న టీజీఎస్‌ఆర్టీసీ జాక్ ఆధ్వర్యంలో ఇందిరాపార్క్ వద్ద సామూహిక నిరాహారదీక్షలు నిర్వహించనున్నట్టు ఆర్టీసీ జాక్ చైర్మన్ ఈదురు వెంకన్న, వైస్ చైర్మన్ థామస్‌రెడ్డి తెలిపారు.

వరంగల్ జిల్లా నల్లబెల్లిలో మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డిని హౌస్ అరెస్టు చేసిన పోలీసులు

నిర్బంధం అప్రజాస్వామికం

- మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి
- మెడికల్ కాలేజీ తెచ్చిన తననే హౌస్ అరెస్ట్ చేయడం హేయం

నల్లబెల్లి, సెప్టెంబర్ 19: జిల్లా దవాఖాన, మెడికల్ కళాశాలను మంజూరు చేసిన తమపైనే కాంగ్రెస్ ప్రభుత్వం నిర్బంధం విధించడం అప్రజాస్వామికమని మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి అన్నారు. వరంగల్ జిల్లా నల్లబెల్లి మండల కేంద్రంలోని తన నివాసంలో ఆయన గురువారం మాట్లాడారు. బీఆర్‌ఎస్ అధినేత కేసీఆర్, అప్పటి ఆరోగ్యశాఖ మంత్రి హరీశ్‌రావు నర్సంపేటలో రూ.283కోట్లతో జిల్లా దవాఖానను మంజూరు చేశారన్నారు. తన కోరిక మేరకు కేసీఆర్ ఆనాడే మెడికల్ కాలేజీని మంజూరు చేసినట్లు గుర్తుచేశారు. కళాశాల ప్రారంభోత్సవానికి సీఎం రేవంత్‌రెడ్డిని ఆహ్వానించిన తననే హౌస్ అరెస్ట్ చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు.

అరెస్టులను ఖండించిన ఎర్రబెల్లి

హనుమకొండ: మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి, బీఆర్‌ఎస్ శ్రేణుల హౌస్ అరెస్టులను తీవ్రంగా ఖండిస్తున్నామని మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు పేర్కొన్నారు. మెడికల్ కాలేజీ మంజూరు చేసింది మాజీ సీఎం కేసీఆర్, బీఆర్‌ఎస్ ప్రభుత్వమైతే.. కాంగ్రెస్ ఖాతాలో వేసుకునేందుకు కుటిల యత్నానికి పాల్పడుతున్నదని ఆరోపించారు.

నీటిని విడుదల చేయాలి

నల్లగొండ జిల్లా మాడ్గులపల్లి మండలానికి డీ-40 కాల్వ ద్వారా నీటిని విడుదల చేసి చెరువులను నింపి తమను ఆదుకోవాలని గురువారం రైతులు మండలంలోని సీత్యాతండా వద్ద కాల్వలో దిగి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా మాజీ సర్పంచ్‌ల ఫోరం మండలాధ్యక్షుడు మారుతి వెంకట్‌రెడ్డి మాట్లాడుతూ.. సుమారు రెండు నెలల నుంచి కాల్వకు నీటిని విడుదల చేయకపోవడంతో రైతులు సాగునీటి కోసం తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. మండలంలోని గణపతివారిగూడెం, సీత్యాతండా, పుచ్చకాయలగూడెం, బొమ్మకల్ గ్రామాల్లోని సాగు భూములన్నీ డీ-40 కాల్వ మీదే ఆధారపడి ఉన్నాయని చెప్పారు. అధికారులు కాల్వకు నీరు ఇవ్వకపోవడంతో ఆయా గ్రామాల్లో రైతులు వేసిన పంటలు ఎండిపోతున్నాయని ఆవేదన వ్యక్తంచేశారు. ఇప్పటికైనా అధికారులు డీ-40 కాల్వ ద్వారా చెరువులను నింపి రైతులకు సాగునీరు అందించాలని డిమాండ్ చేశారు. -మాడ్గులపల్లి

లక్షల ఎకరాల్లోని పంటలను కాపాడాలి

- కల్లూరు ఇరిగేషన్ ఆఫీసు ఎదుట ధర్నాకు పిలుపు
- రైతు నాయకుల ముందస్తు అరెస్టు.. గృహనిర్బంధం
- నిరసనగా బోడేపూడి భవన్ వద్ద రైతుల నినాదాలు

వైరా టౌన్, సెప్టెంబర్ 19: సాగునీరు విడుదల చేసి లక్షల ఎకరాల్లో పంటలు ఎండిపోకుండా కాపాడాలని డిమాండ్ చేస్తూ రైతులు నిరసన వ్యక్తం చేశారు. ఇటీవల కురిసిన అతి భారీ వర్షాల వల్ల నాగార్జున సాగర్ ఎడమ కాలువకు గండ్లు పడటంతో 18 రోజులుగా సాగునీరు తమ పంటల పొలాలకు రావడం లేదని పేర్కొన్నారు. దీంతో ఖమ్మం జిల్లాలోని సాగర్ ఆయకట్టు పరిధిలో పాలేరు రిజర్వాయర్ పాత కాలువ కింది పంటలు ఎండిపోయే పరిస్థితి ఏర్పడిందని ఆవేదన వ్యక్తంచేశారు. ఈ మేరకు ఖమ్మం జిల్లాలోని కల్లూరు ఇరిగేషన్ కార్యాలయం వద్ద గురువారం ఆందోళన చేసేందుకు నిర్ణయించారు. విషయం తెలుసుకున్న పోలీసులు.. అదే రోజు ఉదయం తెలంగాణ రైతు సంఘం నాయకులను ముందస్తు అరెస్టు చేసి గృహ నిర్బంధంలో ఉంచారు. దీంతో మరికొందరు రైతు సంఘం నాయకులు, రైతులు కలిసి వైరా బోడేపూడి వెంకటేశ్వరరావు భవన్ వద్ద నినాదాలు చేశారు. ఖమ్మం జిల్లాలో సాగర్ ఆయకట్టు కింద పంటలు ఎండిపోయి తీవ్రంగా రైతులు నష్టపోయే పరిస్థితి ఏర్పడిందని, వెంటనే పాలేరు రిజర్వాయర్ సమీపంలో నాగార్జునసాగర్ ఎడమ కాలువ గండికి సత్వరమే మరమ్మతులను చేయాలని డిమాండ్ చేశారు.

రైతు సంఘం నాయకుల అరెస్టును నిరసిస్తూ, సాగునీరు విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ ఖమ్మం జిల్లా వైరాలో బోడేపూడి భవన్ ఎదుట నినాదాలు చేస్తున్న నాయకులు

స్తంభించిన 'మీ సేవ'లు

- డాటా కేంద్రంలో సాంకేతిక లోపం
- పది రోజులుగా నిలిచిన సర్టిఫికెట్ల జారీ
- నష్టపోతున్న విద్యార్థులు, ఉద్యోగార్థులు

హైదరాబాద్, సెప్టెంబర్ 19(నమస్తే తెలంగాణ): రాష్ట్రవ్యాప్తంగా మీసేవ కేంద్రాల్లో పది రోజులుగా సేవలు స్తంభించిపోయాయి. దీంతో ఉన్నత విద్యా కోర్సుల్లో ప్రవేశాలు, ఉద్యోగాల కోసం దరఖాస్తు చేయాల్సిన వారికి సకాలంలో సర్టిఫికెట్లు లభించక తీవ్రంగా నష్టపోతున్నారు. రాష్ట్ర డాటా సెంటర్‌లో సాంకేతిక సమస్య కారణంగా ఈ పరిస్థితి తలెత్తిందని అధికారులు చెప్తున్నారు. డిజిటల్ తెలంగాణలో భాగంగా వివిధ రకాల ప్రభుత్వ సేవలను మీసేవ, ఈసేవ కేంద్రాల ద్వారా ప్రభుత్వం అందిస్తున్నది. 38 ప్రభుత్వ శాఖలకు చెందిన 200 వరకు సేవలు 2,856 మీసేవ కేంద్రాల ద్వారా అందుబాటులో ఉన్నాయి. ఇందులో రెవెన్యూశాఖ నుంచి విద్యార్థులు, ఉద్యోగార్థులు పొందాల్సిన కులం, ఆదాయం, ఈడబ్ల్యూఎస్ తదితర సర్టిఫికెట్లు అతి ప్రధానమైనవి. ప్రస్తుతం పీజీ కోర్సుల్లో ప్రవేశాల కోసం ఎంట్రన్స్ ఎగ్జామ్స్ జరుగుతున్నాయి. డిగ్రీ పూర్తిచేసినవారు వివిధ ప్రవేశ పరీక్షలకు హాజరు కావాలన్నా, రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగాలతోపాటు కేంద్ర ప్రభుత్వ ఉద్యోగాలకు దరఖాస్తు చేసుకునేందుకు ఇవి ఎంతో అవసరం. ఉదాహరణకు, వచ్చే ఏడాది ఎంబీఏలో ప్రవేశాల కోసం ఐసెట్ ఎంట్రన్స్ పరీక్ష కోసం పొడిగించిన గడువు కూడా ఈ నెల 20తో పూర్తవుతుంది. అలాగే, ఈ ఏడాది ఎంబీఏ ప్రవేశాల గడువు కూడా ఇటీవలే పూర్తయింది. ఆర్‌ఆర్‌బీ, స్టాఫ్ సెలక్షన్ కమిషన్ నుంచి వెలువడే పలు నోటిఫికేషన్లు, వివిధ కేంద్ర ప్రభుత్వ సంస్థల అప్రెంటిషిప్ గడువు కూడా ఈ మధ్యనే ముగిసింది. కులం, ఆదాయం తదితర సర్టిఫికెట్లతో దరఖాస్తు చేసుకుంటే వారికి ఫీజుల్లో రాయితీ లభించడమే కాకుండా ప్రవేశాల్లో కొంత కోటా వర్తిస్తుంది. పది రోజులుగా మీసేవ కేంద్రాల్లో సేవలు నిలిచిపోవడంతో వీటికి దరఖాస్తు చేసుకున్న వేలాదిమంది అభ్యర్థులు నష్టపోయారు. విద్యార్థులు ఎమ్మార్వో కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నా ఫలితం లేకుండా పోయింది.